సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం ǀ 14 ǀ జూన్ ǀ 2025



అస్తవ్యస్తంగా వరద కాలువలు

ఓ వైపు వాతావరణంలో మార్పులు సంభవించి వానలు ముంచుకొస్తున్నప్పటికీ అధికారుల్లో మాత్రం కదలిక కనిపించడం లేదు. - 8లో



ఆటో గ్యాంగ్ ఖేల్ ఖతం

ఆటో గ్యాంగ్‌ను శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. - 8లో

విద్యుత్‌షాక్‌తో లైన్‌మన్ మృతి



జామి మండలం శాననాపల్లి సచివాలయంలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ రహ్మాన్ సోమయా జులపాలెంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. - 8లో

న్యూస్‌రీల్

సోమవారం సాలూరులో పీజీఆర్ఎస్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం సాలూరులో నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లా అధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. సాలూరు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని స్పష్టంచేశారు. జిల్లా అధికారులందరూ సాలూరులో నిర్వహించనున్న పీజీఆర్ఎస్‌లో పాల్గొనాలని కోరారు.

గిరిజన వర్సిటీ పనులు వేగవంతం చేయండి

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక డిమాండ్



గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణిని కలిసిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రతినిధి బృందం

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ పనులను వేగవంతం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. వర్సిటీ పనులను శుక్రవారం పరిశీలించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టీవీ కట్టిమణిని కలిసి నిర్మాణానికి సంబంధించిన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ 2019లో స్థాపితమైన విశ్వవిద్యాలయ నిర్మాణం ఇప్పటికీ పూర్తికాకపోవడం విచారకరమన్నారు. పనుల్లో ప్రభుత్వం అశ్రద్ధ చూపడం తగదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో గిరిజన వర్సిటీది కీలకపాత్రగా అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.విజయగౌరి, నాయకులు వెంకటరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్.జమ్ము క్లస్టర్‌లో రూ.23 లక్షల అవినీతి

- దర్యాప్తునకు డిమాండ్ చేసిన ఏపీ గిరిజన సంఘం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము వెలుగు పథకం క్లస్టర్‌లో 2014 నుంచి 2020 వరకు సీసీగా పనిచేసిన గరుగుబిల్లి శ్రీనివాసరావు ఉన్నతి పథకం రుణాల పేరుతో రూ.23 లక్షలు అవినీతికి పాల్పడ్డారని ఏపీ గిరిజన సంఘం జిల్లా నాయకులు మండంగి రమణ, మండంగి శ్రీనివాసరావు ఆరోపించారు. అవినీతిపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాయగడ జమ్ము క్లస్టర్లో రాయగడ జమ్ము, బాలేసు, చాపరాయి బిన్నిడి పంచాయతీలు (వీఓఏలు) ఉన్నాయి. ఈ మూడు వీఓఏల పరిధిలో సుమారు 14 మహిళా సంఘాల నుంచి ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు ఉన్నతి పథకం కింద గిరిజనులకు అప్పులు ఇస్తామని చెప్పి సంతకాలు చేయించుకొని రూ.23 లక్షలను సీసీ స్వాహా చేశారు. అప్పట్లోనే ఈ అవినీతిపై ఐటీడీఏ పీఓ, ఏపీఎంలకు ఫిర్యాదు చేశాం. ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అవినీతికి పాల్పడిన శ్రీనివాసరావును మరలా రాయగడజమ్ము క్లస్టర్‌కు సీసీగా నియమించారు. దీనిని చూస్తే అధికారులే అవినీతికి ప్రోత్సాహిస్తున్నట్లుందని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గతంలో జరిగిన అవినీతికి సంబంధించి సమగ్ర దర్యాప్తు జరిపించాలని, శ్రీనివాసరావును విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు పువ్వల తిరుపతిరావు, బిడ్డిక శంకరరావు, సన్యాసిరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఎం.సురేష్‌బాబు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రక్తకొరత నివారణకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది డి.మృదుల, రమేష్‌కుమార్, కె.రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు బదిలీ ట్రీట్మెంట్!



తహసీల్దార్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు (ఫైల్)

- ఎమ్మెల్యేతో వివాదం కేసులో ట్విస్ట్
- పంతం నెగ్గించుకున్న టీడీపీ!

సాక్షి, పార్వతీపురం మన్యం:

కొద్ది రోజులుగా పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే, మండల తహసీల్దారు మధ్య నెలకొన్న వివాదంలో ఊహించిందే జరిగింది. రాజకీయ ఒత్తిళ్లకు 'అధికారం' తలొగ్గింది. పార్వతీపురం తహసీల్దారు జయలక్ష్మికి బదిలీ ట్రీట్మెంట్ ఇచ్చారు. ఆమెను జియ్యమ్మవలస మండలానికి పంపించారు. తహసీల్దారును ఇక్కడి నుంచి పంపించేయాలని అధికారులపై ఒత్తిడి చేసిన టీడీపీ శ్రేణులు.. చివరికి తమ పంతం నెగ్గించుకున్నాయన్న చర్చ ఉద్యోగవర్గాల్లో సాగుతోంది.

ఇదీ వివాదం..

కొద్దిరోజుల కిందట పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర రాత్రి సమయంలో ఫోన్ చేసి, అసభ్య పదజాలంతో తనను దూషించారని తహసీల్దారు జయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఒక లేఖ బయటకు వచ్చిన విషయం విదితమే. దీనిపై తహసీల్దారు నిర్ధారణ చేయనప్పటికీ.. ఎమ్మెల్యే మాత్రం మీడియా సమావేశం పెట్టి మరీ... సదరు మహిళా అధికారిణిపై విరుచుకుపడ్డారు. ఆమె పెద్ద అవినీతిపరురాలని చెప్పారు. డిజిటల్ సంతకాల కోసం గ్రామస్తుల నుంచి రూ.లక్షల్లో డిమాండ్ చేశారని ఆరోపించారు. మరోసారి ఆమెను కించపరిచేలా, అసభ్యకరంగా మాట్లాడారు. ఆ మరుసటిరోజు పార్వతీపురం తహసీల్దారు కార్యాలయం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. తహసీల్దారు జయలక్ష్మికి వ్యతిరేకంగా పలువురితో ఫిర్యాదులు చేయించారు. ఆ సమయంలో విచారణకు వచ్చిన సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ వద్దే నినాదాలు చేశారు. ఆమెను విధుల నుంచి తప్పించాలని, ఇక్కడ నుంచి పంపించేయాలని పట్టుబట్టారు. ఆమె మానసిక స్థితి సరిగ్గా లేదంటూ తూలనాడారు. ఈ ఫిర్యాదులపై విచారణ చేపట్టి నివేదిక కలెక్టరుకు అందజేస్తామని అప్పట్లో సబ్ కలెక్టర్ చెప్పారు. నివేదిక వివరాలేవీ బహిర్గత పరచలేదు సరికదా.. తప్పు ఎవరిది తేల్చారో గానీ... తహసీల్దార్ జయలక్ష్మిని తాజాగా జరిగిన బదిలీల్లో జియ్యమ్మవలస మండలానికి పంపించారు. వాస్తవానికి ఆమె పార్వతీపురం మండలానికి వచ్చి ఎన్ని రోజులూ కాలేదు. మధ్యలో కొన్ని నెలలు సెలవు పెట్టి వెళ్లిపోయారు. ఆ సెలవు వెనుక కారణం కూడా రాజకీయ ఒత్తిళ్లే అన్న విమర్శలు వినిపించాయి. ఇక్కడ చేయలేక, ఆమెనే బదిలీకి దరఖాస్తు చేసుకున్నారా, లేక రాజకీయ కారణాలతో మరోచోటకు పంపించి వేశారా? అన్న చర్చ నడుస్తోంది.

ఇంకేం పని చేయగలం?

కూటమి ప్రభుత్వంలో ఒక మహిళా తహసీల్దారుకు జరిగిన అన్యాయంపై ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. విధుల్లో ఒత్తిడి తీసుకురావడమే కాక.. మాట వినలేదన్న కారణంతో చిన్న విషయాన్ని రాజకీయం చేసి, ఆమెను మరోచోటకు బదిలీ చేయడంపై ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా వేధిస్తే ఇంకేం పని చేయగలమని వాపోతున్నారు. ఉన్నతాధికారులు సైతం రాజకీయ నాయకులు చెప్పినట్లే తలాడిస్తున్నారని వాపోతున్నారు.

పది మంది తహసీల్దార్లకు బదిలీ

పార్వతీపురం రూరల్: జిల్లాలో పది మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీపై వెళ్లే తహసీల్దార్లు నిర్దేశించిన సమయంలో వారికి కేటాయించి మండలాల్లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

ఇద్దరికి ఉద్యోగున్నతి

ఇద్దరు గ్రేడ్-1 వీఆర్వోలు సీహెచ్ భారతమ్మ, బి.శ్రీనివాసరావుకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వారిని కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
మామిడిపల్లి సురేష్	భోగాపురం	పార్వతీపురం
ఆర్.బాలమురళీకృష్ణ	పాలకొండ	బలిజిపేట
బి.నీలకంఠరావు	కొత్తవలస	సాలూరు
కె.జయ	జిల్లా కలెక్టర్ కార్యాలయం	కురుపాం
డీఎంజీఎస్ ప్రసాద్	ఎల్.కోట	మక్కువ
వై.జయలక్ష్మి	పార్వతీపురం	జియ్యమ్మవలస
ఎ.సాయికామేశ్వరరావు	కొమరాడ	వీరఘట్టం
సీహెచ్ రాధాకృష్ణమూర్తి	జిల్లా కలెక్టర్ కార్యాలయం	పాలకొండ
ఎన్.శివన్నారాయణ	గుమ్మలక్ష్మీపురం	భామిని
ఎన్.చిన్నారావు	జియ్యమ్మవలస	జిల్లా కలెక్టర్ కార్యాలయం

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎండీయూ ఆపరేటర్లు



మా పొట్ట కొట్టారు

- కలెక్టరేట్ వద్ద ఎండీయూ వాహన ఆపరేటర్ల ఆందోళన
- కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- చిరుద్యోగులను తొలగిస్తున్న పాలకుల పదవులను ఊడగొడతామని హెచ్చరిక

పార్వతీపురంటౌన్:

ఎన్నికల ముందు నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.... లేదంటే నిరుద్యోగ భృతి చెల్లిస్తామని నమ్మించారు.. తీరా అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థను రద్దుచేసి వేలాదిమందికి ఉపాధి లేకుండా చేశారు... ఎండీయూ వ్యవస్థను ఆపేసి ఆపరేటర్ల పొట్టకొట్టారు.. వివిధ శాఖల్లోని చిరుద్యోగులను తొలగిస్తున్నారు.. ఉపాధిహామీ మేట్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఫీల్డు అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారు.. ఇవే వేధింపుల పరంపర కొనసాగితే పాలకుల పదవులు కూడా ఊడగొట్టేరోజు వస్తుందని ఎండీయూ ఆపరేటర్లు హెచ్చరించారు. తమకు జరిగిన అన్యాయానికి నిరసగా కలెక్టరేట్‌ను శుక్రవారం ముట్టడించారు. కూటమి ప్రభుత్వ చిరుద్యోగ వ్యతిరేక విధానాలపై నిరసన తెలిపారు. ఇంటింటికీ రేషన్ సరఫరాను జూన్ 1 నుంచి నిలిపివేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో తమ బతుకు బండికి భరోసా కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. 196 ఎండీయూ వాహనాల ఆపరేటర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండీయూ వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కూటమి నిర్ణయం సరైనది కాదు



కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదు. పాత విధానంలోనే ఇళ్ల వద్దకు రేషన్ సరుకులు అందజేసేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో 196 మంది ఆపరేటర్లు రోడ్డున పడ్డారు. వారికి ప్రభుత్వం భరోసా కల్పించాలి. రాష్ట్ర నాయకులతో కలిసి ప్రభుత్వంపై ఉద్యమం చేపడతాం.

– పి.మన్మథ, ఎండీయూ ఆపరేటర్ల జిల్లా అధ్యక్షుడు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలి. ప్రభుత్వం జూన్ 1 నుంచి రేషన్ వాహనాలను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. మాలాంటి ఎండీయూ ఆపరేటర్లు ఎంతో మంది ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలి.

– ఎం.గౌరీశంకరరావు, ఎండీయూ ఆపరేటర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

వీధిన పడ్డాం



కూటమి ప్రభుత్వం రేషన్ వాహనాలను నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయంతో వీధిన పడ్డాం. ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థపై పునరాలోచించాలి. ఎండీయూ వ్యవస్థను పునరుద్ధరించాలి. పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

– జంజేటి ప్రసాద్, ఎండీయూ ఆపరేటర్, పార్వతీపురం

పిల్లలను తరలిస్తే ఊరుకోం

బలిజిపేట: తల్లిదండ్రుల అనుమతి లేకుండా పెదపెంకి దళితపేట ప్రాథమిక పాఠశాల-1లో చదువుతున్న 3, 4, 5 తరగతుల పిల్లలను మోడల్ స్కూల్‌కు తరలించడం అన్యాయమంటూ పాఠశాల వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. దళితపేటలో సుమారు 800 కుటుంబాలు నివసిస్తున్నాయి. కూలి పనుల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇంట్లో ఉండే వృద్ధులు, బంధువులకు పిల్లలను అప్పగిస్తాం. ఆ సమయంలో దూర ప్రాంతంలోని పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లి, తేవడం కష్టం. పాఠశాల కమిటీ సమావేశం జరపకుండా, తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఏకాభిప్రాయంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదు. మా పిల్లలను వేరే పాఠశాలకు పంపేదేది లేదని తెగేసి చెప్పారు. ఊరి బడిని నిర్వీర్యం చేసే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు నల్ల ఈశ్వరరావు, దళితపేటవాసులు పాల్గొన్నారు.



పెదపెంకి దళితపేటలో ఉండే పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

ఏజెన్సీలో ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ

విజయనగరం అర్బన్: గిరిజన ప్రాంతాల్లో రేషన్ సరఫరాను పాత ఎండీయూ విధానంలో కొనసాగించాలని, లేదంటే ప్రత్యేక రేషన్ డిపోలను ఏర్పాటుచేసి సరుకులు సరఫరా చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. రేషన్ తీసుకోవడంలో గిరిజనుల ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందిస్తూ శుక్రవారం మాట్లాడారు. ప్రస్తుతం రేషన్ తీసుకోవడంలో గిరిజనులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయి కమిషనర్‌కు ఎస్టీ కమిషన్ లేఖ రాసిందన్నారు. ఎండీయూ విధానాన్ని ఆపడం వల్ల గిరిజనులు వ్యయప్రయాసలకు గురవుతున్నారని, ఏజెన్సీలో ఇంటింటికీ రేషన్ సరఫరా విధానం కొనసాగించాలని కోరారు.

ముగిసిన టీచర్ల బదిలీ కౌన్సెలింగ్



బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

- ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేసినా చూపించిన క్లస్టర్ ఖాళీలు
- 2,300 మంది ఎస్జీటీలకు బదిలీ

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ సంఘాల ఆందోళనలు.. నిరసనలు.. బైఠాయింపులు.. కౌన్సెలింగ్ కేంద్రంలో ఖాకీల హడావిడితో చివరకు ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాతిపదికన చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ శుక్రవారం అర్ధరాత్రితో ముగిసింది. 2,300 మంది ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో బదిలీచేశారు. ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనకు దిగినా ఉన్నతాధికారుల సూచనల మేరకు క్లియర్ వేకెన్సీలు మాత్రమే భర్తీ చేశారు. క్లస్టర్ ఖాళీలు చూపించలేదు. చివరి రోజు 1,001 నుంచి ప్రారంభించిన కౌన్సెలింగ్ చివరి నంబర్ వరకు పూర్తి చేయాలనే ఉద్దేశంతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని అందరికీ సమాచారం ఇచ్చారు. ఒకే రోజు దాదాపు వెయ్యిమందిని పిలవడంతో జిల్లా పరిషత్ సమావేశ మందిరం పరిసరాలు ఉపాధ్యాయులతో సందడిగా మారాయి. తాజాగా ఉన్న ఖాళీ స్థానాలన్నిటినీ తప్పనిసరి బదిలీ ఉపాధ్యాయులు కోరుకోవడంతో, రిక్వెస్ట్ బదిలీల ఉపాధ్యాయులు అధికంగా తమ స్థానాల్లోనే ఉండిపోయేందుకు సుముఖత తెలిపారు. 1,400 సీరియల్ ప్రారంభ సమయానికి మైదాన ప్రాంత మండలాల స్కూల్స్‌లో పోస్టులన్నీ భర్తీ అయిపోయాయి. మిగిలిన ఉపాధ్యాయులు ఏజెన్సీ మండలాలైన జీఎల్‌పురం, కురుపాం, కొమరాడ మండలాల సుదూర ప్రాంతాల స్కూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పలువురు మహిళా టీచర్లు ఆవేదన చెందారు. డీఈఓ యు.మాణిక్యంనాయుడు మాట్లాడుతూ క్లస్టర్ ఖాళీలను ఉన్నతాధికారుల సూచనల మేరకు చివరి వరకు చూపించలేదన్నారు. మిగిలిన 152 మంది ఉపాధ్యాయులకు పోస్టింగ్‌ల కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఖాకీల హడావిడిపై గురువుల గుర్రు

విజయనగరం క్రైమ్: డీఈఓ మాణిక్యంనాయుడు ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయ కౌన్సెలింగ్ కేంద్రం వద్ద సీఐ శ్రీనివాస్, వన్‌టౌన్ ఎస్ఐలు రామగణేష్, రమణ, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు. కౌన్సెలింగ్ కేంద్రంలో పోలీసుల హడావిడిపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లోపాలను విడిచిపెట్టి గురువులపై పోలీసులతో పెత్తనం సాగించాలని చూస్తే మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.



బదిలీ కౌన్సెలింగ్ కేంద్రంలో పోలీసుల హడావిడి

రాష్ట్రంలో హిట్లర్, ముస్సోలిని పాలన

- అందరికీ తల్లికి వందనం అని చెప్పి అన్ని నిబంధనలేమిటి?
- ఏం సాధించారని ఏడాది సుపరిపాలన సంబరాలు..
- మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు రాజన్నదొర



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర, పాల్గొన్న నాయకులు

సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు:

రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం స్థానంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని.. హిట్లర్, ముస్సోలిని వంటి నియంతలను చంద్రబాబు, లోకేశ్‌లు తలపిస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పీడిక రాజన్నదొర విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలని దగా చేసి, అన్ని వర్గాలనూ మోసగించి.. ఏడాది కాలంలో ఏం సాధించారని సుపరిపాలన సంబరాలు చేసుకుంటున్నారని కూటమి నాయకులకు ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం పట్ల ప్రజలు విసిగిపోయారని తెలిపారు. నిజంగా వారు మంచి పరిపాలన అందిస్తే.. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఎందుకు బ్రహ్మరథం పడతారని ప్రశ్నించారు. సాలూరులో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇదేం సుపరిపాలన?

ఇది ఏ సుపరిపాలనో తనకైతే అర్థం కావడం లేదని రాజన్నదొర అన్నారు. 'తల్లికి వందనం గత ఏడాది పూర్తిగా ఎగ్గొట్టేశారు. ప్రస్తుతం ఇస్తున్నది ఈ విద్యా సంవత్సరానికి సంబంధించినది. దీపం-2 కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామన్నారు. ఈ ఏడాది కాలంలో ఒక్కటే ఇచ్చారు. పింఛన్లు ఇవ్వడం వారి గొప్పా.. ఏ ప్రభుత్వం వచ్చినా కచ్చితంగా దానిని కొనసాగిస్తుంది. సూపర్ సిక్స్ కాకుండా.. గత ప్రభుత్వం అమలు చేసినవి, ఇతర పథకాలన్నీ కలిపి 150 వరకూ ఉంటాయి.. అవన్నీ ఎక్కడ? సంక్షేమ క్యాలెండర్ లేదు, జాబ్ క్యాలెండర్ లేదు.. గతంలో ఇచ్చిన పథకాలన్నీ నిలిపివేశారు. ఇదేనా, ఇలాగేనా సుపరిపాలన? అడిగితే అరెస్టులు, మాట్లాడితే కేసులు.. అంబేడ్కర్ రాజ్యాంగం రాష్ట్రంలో అమలు కావడం లేదు. రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. హిట్లర్, ముస్సోలిని పాలన సాగుతోంది..' అని విమర్శించారు.

ఏడాదిలోనే పాలన తేలిపోయింది..

ఏడాది కాలంలోనే కూటమి పాలన తేలిపోయిందని రాజన్నదొర విమర్శించారు. వారిది నిజంగా సుపరిపాలన అయితే.. వారి భాషలో కనీసం ప్రతిపక్ష నేత కాని, కేవలం పులివెందుల ఎమ్మెల్యే అయిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఎందుకు బ్రహ్మరథం పడుతున్నారని ప్రశ్నించారు. పొదిలిలో జన ప్రవాహం కనిపించిందని.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు ఇది అద్దం పడుతోందని చెప్పారు.

తల్లికి వందనం.. అమల్లో మోసం



అమ్మ ఒడి పథకంలో ఉన్న నిబంధనలపై విమర్శలు చేసిన చంద్రబాబు, లోకేశ్‌లు.. తల్లికి వందనం పథకం విషయంలో అంతకుమించి నిబంధనలు ఎందుకు తీసుకొచ్చారని రాజన్నదొర ప్రశ్నించారు. 'గతంలో అమ్మఒడి సుమారు 80 లక్షల మందికి ఇచ్చాం.. ఒక్క విద్యార్థి చొప్పున అమలు చేస్తేనే అంతమంది. మీరు అందరికీ ఇస్తామన్నారు. అందుకోసం మీరు ప్రత్యేకంగా ఎంత బడ్జెట్ కేటాయించారు. ఎందరికి కోత పెడుతున్నారు. కార్పొరేషన్ల నిధులు ఇటు మళ్లించారా? ఓట్లు దండుకోవడానికి ఎక్కువ మంది పిల్లలకు అమలు చేస్తామని చెప్పి.. ఇప్పుడు అన్ని నిబంధనలతో కొర్రీ పెడుతున్నారా?' అని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. నాడు తాము 70 శాతం హాజరు నిబంధన పెడితే.. ఇదే టీడీపీ విమర్శించిందని.. ఇప్పుడు ఉన్నది ఏమిటన్నారు. తాము పాఠశాల నిర్వహణ కోసం రూ.2 వేలు చొప్పున ఉంచితే కూటమి నేతలు గగ్గోలు పెట్టారని.. ఇప్పుడు రూ.13 వేలు ఇస్తామని జీవో ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఈ నిబంధనలు ఏవీ మీరు చెప్పలేదు. ఎన్నికలప్పుడు అందరి ఓట్లు కావాలి. ఇప్పుడు నిబంధనలతో భారీగా కోత పెట్టారు. వారి కన్నీళ్లు మీకు తగులుతాయి. 'తల్లికి వందనం.. అమల్లో మోసం' అని విమర్శించారు. జగన్ పోరాటం వల్లే ఇప్పుడైనా పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా పడి ఇద్దరు మహిళలకు గాయాలు



ఆటో ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన సావిత్రి

చీపురుపల్లి: పట్టణంలోని రాజాం రోడ్‌లో వెదుళ్లవలస జంక్షన్ వద్ద ఆటో బోల్తా పడడంతో ఇద్దరు మహిళలకు గాయలయ్యాయి. ఇద్దరిలో సవరపు సావిత్రికి తీవ్రగాయాలు కాగా గుంప సావిత్రికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం చీపురుపల్లి నుంచి రాజాం వెళ్తున్న ఆటోలో గరివిడి మండలానికి చెందిన సవరపు సావిత్రి, విజయనగరానికి చెందిన గుంప సావిత్రితో పాటు మరికొంత మంది ప్రయాణికులు ఉన్నారు. రైల్వేస్టేషన్ దాటిన తరువాత వెదుళ్లవలస జంక్షన్ వద్ద ఎదురుగా మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనం రావడాన్ని గుర్తించిన ఆటో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా కొట్టింది. దీంతో బొండపల్లికి చెందిన సవరపు సావిత్రి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అలాగే విజయనగరానికి చెందిన గుంప సావిత్రికి స్వల్ప గాయలయ్యాయి. దీంతో ఆ ఇద్దరినీ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చేర్పించిన అనంతరం తీవ్ర గాయాల పాలైన సవరపు సావిత్రిని అత్యవసర వైద్యం నిమిత్తం విజయనగరం రిఫర్ చేశారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో పేకాట రాయళ్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. తమకు వచ్చిన ముందస్తు సమాచారంతో ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి..స్థానిక సీత చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8,860 నగదు సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో పేకాట, కోడిపందాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

ఏగోటివలస పొలాల్లో ఏనుగుల గుంపు

సీతానగరం: మండలంలోని కోట సీతారాంపురంలో నాలుగు రోజులుగా తిష్టవేసిన ఏనుగుల గుంపు శుక్రవారం ఏగోటివలస పొలాల్లో సంచరిస్తున్నాయని గ్రామస్తులు తెలియజేశారు. కోట సీతారాంపురం గ్రామానికి వచ్చిన 8 ఏనుగుల **గుంపు 9కి** చేరడంతో తాజాగా 9 ఏనుగుల గుంపు ఏగోటివలస పొలాల్లో సంచరిస్తున్నాయి. కోటసీతారాంపురం రైతు కె.రత్నాకర్ పొలంలో మొక్కలు ధ్వంసం చేయడంతో నష్టం వాటిలిందని తెలియజేశారు. ఇక్కడి పొలాల్లో ఏనుగులు ఏమేరకు నష్టాల్ని తెస్తాయోనని చెరకు, మామిడిరైతులు ఆందోళన చెందుతున్నారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సారా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జియ్యమ్మవలస మండలం చినబుడ్డిడి గ్రామ సమీపంలో నిర్వహించిన దాడుల్లో ద్విచక్ర వాహనంపై 20 లీటర్ల సారాను తరలిస్తున్న ఓ వ్యక్తి పట్టుబడినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు తన కార్యాలయం వద్ద సీఐ విలేకరులతో మాట్లాడుతూ పట్టుబడిన వ్యక్తికి సారాను సరఫరా చేసిన మరో వ్యక్తిని కూడా త్వరలో అరెస్ట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జియ్యమ్మవలస మండలంలో గల పెదతుంబలి గ్రామాన్ని సారా రహిత గ్రామంగా గ్రామ కమిటీ తీర్మానం మేరకు ప్రకటించినట్లు సీఐ పేర్కొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹107	₹184	₹194

అస్తవ్యస్తంగా వరద కాలువలు

- నిలిచిపోయిన కల్వర్టుల నిర్మాణం
- ఆందోళనలో రైతులు

పార్వతీపురం రూరల్: ఓ వైపు వాతావరణంలో మార్పులు సంభవించి వానలు ముంచుకొస్తున్నప్పటికీ అధికారుల్లో మాత్రం కదలిక కనిపించడం లేదు. ఎక్కడ చూసినా పంట కాలువలు పూడికలతో నిండిపోయి వర్షం కురిస్తే వరదనీరు కాలువల ద్వారా చెరువుల్లోకి పారేందుకు ఆస్కారం లేకుండా అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. ఉపాధిహామీ పథకంలో పూడిక తీత వంటి పనులు చేపట్టే వెసులుబాటు ఉన్నా జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఆ ఊసే లేకుండా పోయింది. సంబంధిత అధికారులు ఇంత వరకు ఆ దిశగా చర్యలు తీసుకోనప్పటికీ ఏ ఛానల్లో ఎంత పరిధి నిధులు అవసరమన్నది ఉపాధి, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి ప్రతిపాదనలు చేసి ఇప్పటికే పనులు పూర్తిచేయాలి. కానీ వాటి జోలికే అధికారులు వెళ్లలేదు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన లంకెల చెరువు కల్వర్టు పనులు

ఎక్కడ చూసినా అధ్వానమే

జిల్లాలో చాలా వరకు పంటలకు ఆధారమైన పంట కాలువలు పూడికలతో నిండిపోయి వాటి ఆనవాళ్లే లేకుండా మారాయి. ప్రధానంగా చెరువులైతే వాటి విస్తీర్ణం తగ్గి బక్కచిక్కిన దుస్థితిలో దర్శనమిస్తున్నాయి. వాటికి సంబంధించిన భూములు కూడా శిథిలమయ్యాయి. గతంలో కూడా పనులు సక్రమంగా చేపట్టక వాటి లైనింగ్ పనులు పూర్తిగా పాడై పంట సాగుకు నీరు పారని దుస్థితిలో ఉన్నాయి. ఇప్పటికే వాటి పనులు జరిగి ఉంటే రైతులకు సాగునీటికి ఇబ్బంది ఉండేది కాదు. నాలుగు వారాల్లో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ ఎక్కడా పనులు ప్రారంభించిన దాఖలాలు కన్పించడం లేదు.



తుప్పలు, డొంకలతో నిండి ఆనవాలు మారిన కాలువ

గిరిజన ప్రాంతాల్లో ఇదే దుస్థితి

జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో దాదాపుగా వందల కొద్దీ చెక్‌డ్యాంలు గతంలో నిర్మించారు. వాటితో గిరిజన రైతుల ఆయకట్టు భూమికి పుష్కలంగా సాగునీరు అందేది. సమీపంలో ఉన్న వాగుల ద్వారా చెరువులు, గెడ్డలు నిండి వాటి ద్వారా పంటలకు సాగునీరు అందించేందుకు కార్యాచరణ జరిగేది. ఈ క్రమంలో వేసవిలో కూడా గిరిజన రైతులు పంటలు పండించుకునేందుకు ఆస్కారం ఉండేది. కొన్నేళ్లుగా వాటివైపు చూసే నాథుడే లేక అలాగే చెక్‌డ్యాంల నిర్వహణ మరమ్మతులు జరగక కాలువల్లో పూడికలు పేరుకుపోయి రైతులను ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికిప్పుడు భారీ వర్షాలు కురిస్తే నీరు వృథాకావడమే కాకుండా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ భూముల సైతం ముంపు బారిన పడక తప్పదని ఆప్రాంత గిరిజనులు వాపోతున్నారు.



గుమ్మలక్ష్మీపురం మండలంలో గాంద్ర గెడ్డ చెక్ డ్యాం శిథిలావస్థకు చేరడంతో నీరు వృథా పోకుండా అడ్డుకట్ట వేస్తున్న రైతులు

అలసత్వంతో అవినీతి

జిల్లా వ్యాప్తంగా ఉన్న నీటి ప్రాజెక్టులకు సంబంధించిన పంటకాలువల్లో పూడికలు తీసే పనులు జనవరి నుంచి మే మాసం లోపే అధికారులు పూర్తి చేసి వర్షాకాలానికి సన్నద్ధం కావాలి. ఈ పనులేవీ చేయకుండా వర్షాకాలం వచ్చిన తరువాత నిధులు కేటాయించి కాలువల్లో వరదనీరు ఉంటుంది కాబట్టి ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఆ నిధులను దుర్వినియోగం చేసేందుకు అధికారులు కుట్ర పన్నుతున్నారన్న ఆరోపిణలు వినిపిస్తున్నాయి. ఇటీవల తోటపల్లి కాలువకు సంబంధించిన పనుల్లో ఓ అధికారి పనులు నిర్వహించకుండానే ఎం బుక్‌లు చేసి నిధులు ఏవిధంగా తారుమారు చేశారో తెలిసిందే. ఇదే వైఖరిని అధికారులు కొనసాగిస్తున్నారు.



– ఎం.కృష్ణమూర్తి, రైతుసంఘం నాయకుడు

మెరుగైన వైద్య సేవలు కల్పించాలి



డీఆర్‌వో హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కమిటీ సభ్యులు

- ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక కమిటీ డిమాండ్
- డీఆర్‌ఓకు వినతి పత్రం అందించిన కమిటీ సభ్యులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో గణనీయమైన సంఖ్యలో గిరిజనులు, పేదలు నివసిస్తున్నారని జిల్లాలో ప్రధానంగా వైద్యానికి ప్రభుత్వ ఆస్పత్రులే ఆధారమని కానీ చాలా ఆస్పత్రుల్లో సరైన మౌలిక వసుతులు లేవని వెంటనే మెరుగుపరచాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అభివృద్ధి వేదిక కమిటీ సభ్యులు ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా జిల్లాలోని సాలూరు, కురుపాం, సీతంపేట, పార్వతీపురం ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించి, వైద్య సదుపాయాలపై రోగులు, ఆయా ఆస్పత్రుల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పర్యటన అనంతరం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రాన్ని అందించి సమస్యలను వివరించారు. వెంటనే వైద్య సదుపాయాలను మెరుగుపరిచే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

ఒక బెడ్‌పై ఇద్దరు అంతకంటే ఎక్కువగా..

ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి 150 పడకలకు, సాలూరు ఆస్పత్రి 100 పడకలకు, కురుపాం 50 పడకలకు, భద్రగిరి 50 పడకలకు, సీతంపేట 250 పడకలకు అప్‌డేట్ అయినప్పటికీ భవన నిర్మాణాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీని వల్ల ఒకే బెడ్‌పై ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది పడుకోవలసి వస్తోందన్నారు. అంతేకాక సాలూరులో గైనకాలజిస్టులు ఉన్నా ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి రాలేదని, సాలురులో డాక్టర్ల కొరత కుడా చాలా ఎక్కువగా ఉందన్నారు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, అంకాలజీతో సహా అన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చేలా డాక్టర్లను నియమించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు అత్యధికంగా నివసించే ప్రాంతమైన మక్కువ మండలంలోని నంద, దుగ్గేరు, సాలూరు మండలంలోని కురుకూటి, పాచిపెంట మండలంలోని వేటగాని వలస వంటి ప్రాంతాల్లో అదనంగా పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని వివరించారు. కార్యక్రమంలో కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు కె.విజయయ గౌరి, వేదిక నాయకులు వెంకటరావు, ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, సీఐటీయూ మన్యం జిల్లా కార్యదర్శి బీవీ రమణ, డీవైఎఫ్ఐ నాయకుడు పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

యోగాంధ్ర పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురం టౌన్: యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమాల్లో బాగంగా జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహించినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలను పర్యవేక్షించారు. జిల్లాలోని వివిధ మండల,పట్టణ స్థాయి యోగాంధ్ర పోటీల్లో గెలుపొందిన వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో యోగా పోటీలు నిర్వహించామన్నారు.యోగా చిత్రలేఖనం, సాంగ్స్, ఎస్సే, గ్రూప్ యోగా ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. యోగా గురు మోహన్ గంతాయత్ బృందంతో కూడిన ఐదుగురు సభ్యులు జిల్లా స్థాయి పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. జిల్లా పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందినవారు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్బీఎస్కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు, హోమియో వైద్యురాలు డా.సుశీల, జిల్లా కన్సల్టెంట్ డా రఘు,యోగా మాస్టర్స్ మోహన్ గంతాయత్, జనార్దన రావు, డా.హేమాక్షి, డా.వర్మ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు

విద్యుత్‌షాక్‌తో లైన్‌మన్ మృతి



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన జూనియర్ లైన్‌మన్ రహ్మాన్

శృంగవరపుకోట: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఆ శాఖలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మన్ మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం జామి మండలంలోని సోమయాజుల పాలెం గ్రామంలో జరిగింది. శాసనాపల్లి సచివాలంయలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ రహ్మాన్ శుక్రవారం సోమయాజులపాలెంలో విద్యుత్ పోల్ ఎక్కి మరమ్మతులు చేస్తుండగా, ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి కింద పడిపోయాడు. విద్యుత్ సిబ్బంది హుటాహుటిన విజయనగరంలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఉద్యోగం వచ్చిందని, కుటుంబానికి ఆసరాగా కొడుకు ఉన్నాడని, మురిసిపోయామని, తమ ఆనందం మూడు రోజులు ముచ్చటే అయ్యిందని, ఇక తమకు దిక్కెవరంటూ మృతుడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించడం గ్రామస్తులను కలిచివేసింది.

చికిత్స పొందుతూ వృద్ధుడు..



చికిత్స పొందుతూ మృతి చెందిన అప్పారావు (ఫైల్)

లక్కవరపుకోట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖపట్నంలో గల కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన పెదగాడ అప్పారావు(77) శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 9వ తేదీన ఎల్.కోట జంక్షన్ నుంచి అప్పారావు సోంపురం వెళ్తుండగా వెనుక నుంచి కారు వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైన అప్పారావును విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రక్తదానం జీవనదానమే

విజయనగరం: యవత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని విజయనగరం రెడ్ క్రాస్‌సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో విజయనగరం ఫోర్ట్ క్యాంపస్‌లో గల స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన రక్తదాన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఒక వ్యక్తి ఎక్కువమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. దాత నుంచి సేకరించిన బ్లడ్‌ను హోల్ బ్లడ్ అని పిలుస్తారని, దానిని ప్లాస్మా, ప్లేట్‌లెట్స్‌గా విడదీసి ఇతరులకు రక్తాన్ని వినియోగిస్తారని చెప్పారు. రక్తదానం జీవనదానమే కాబట్టి ఈ విషయంపై నేటి యువత శ్రద్ధ పెట్టి రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీఎస్ఏ రాజు, ఏపీ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, సుభద్రాదేవి, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె.హరికృష్ణ ప్రసాద్, కేఎస్ఏ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆటో గ్యాంగ్ ఖేల్ ఖతం

- నిందితులు విజయనగరం వాసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలో ఇటీవల రెచ్చిపోయిన ఆటో గ్యాంగ్ ఆటను పోలీసులు కట్టించారు. ఈ గ్యాంగ్‌కు సంబంధించి విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే..

వృద్ధదంపతులను ఏమార్చి..

ఈ నెల 5న ఎచ్చెర్ల మండలం కొత్తపేట పంచాయతీ సాకివానిపేటకు చెందిన వృద్ధ దంపతులు కోరాడ రమణ, రామలక్ష్మిలు శ్రీకాకుళంలో ఆటోలో ప్రయాణిస్తుండగా పుస్తెలతాడు దొంగిలించారు. అదే రోజు వృద్ధ దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఎస్ఐ రామారావు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం వాహన తనిఖీల్లో భాగంగా తోటపాలెం జంక్షన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ రామారావు, సిబ్బందికి సరిగ్గా ఉదయం పది గంటల సమయంలో ఏపీ 30విడి440 నంబరు గల బజాజ్ మాక్సిమా ఆటో మీద వస్తున్న మహిళలపై అనుమానం కలగడంతో వెంటనే అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణలో విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెట్బాడ గ్రామానికి చెందిన గొర్లె మౌనిక, గొర్లె పెద్దింట్లమ్మ అదే జిల్లా కొత్తవలస మండలం చీడివలసకు చెందిన ఆటో డ్రైవర్ మేకల హరిలుగా పోలీసులు గుర్తించారు. పెద్దింట్లమ్మ, మౌనికలు తల్లీ కూతుళ్లు కాగా, హరి పెద్దింట్లమ్మకు మేనల్లుడు అవుతాడు.

లెక్కకు మించి కేసులు..

వీరిపై ఇతర జిల్లాల్లో, మన జిల్లాలోని రూరల్‌తో కలిపి పదికి మించి కేసులున్నాయని ఎస్ఐ రామారావు తెలిపారు. వీరిదో గ్యాంగు అని, ఈ కేసుకు సంబంధించి వీరే నిందితులని, గ్యాంగులో మరి కొందరు ఉండొచ్చని ఎస్ఐ పేర్కొన్నారు. నిందితుల నుంచి ఆటోను, బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరించామన్నారు.

రక్తదాతలు..ప్రాణదాతలే..!

- స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న యువత
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

రాజాం సిటీ: అన్ని దానాల్లోకెల్లా రక్తదానం మిన్న, రక్తదానం.. మహాదానం అంటూ ఎన్ని ప్రచారాలు చేసినా, స్పందన మాత్రం కొందరిలోనే కనిపిస్తోంది. రక్తదానం చేయాలని ఉన్నా కొన్ని అపోహలు, మనకెందుకులే అన్న భావనతో చాలా మంది రక్తదానం చేసేందుకు ఇష్ట పడడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండగా, ప్రస్తుతం సేకరిస్తున్న రక్తం ఆపదలో ఉన్నవారికి సరిపోవడంలేదు. విపత్కర పరిస్థితుల్లో మేమున్నామంటూ కొంతమంది రక్తదాతలు ముందుకొచ్చి దానం చేయడంతోపాటు అడపాదడపా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాల్లో పాల్గొంటూ అపాయంలో ఉన్న వారిని ఆదుకుంటున్నారు. ఇటువంటి సమయంలో స్వచ్ఛంద సంస్థలు, యువకులు చొరవచూపి రక్తదానానికి ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం.



రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)

ప్రాణంతో సమానం..

ప్రమాదాల్లో గాయపడిన వారికి, అత్యవసర చికిత్సలు అవసరమైన వారికి రక్తం ఎంతో అవసరం. రక్తాన్ని ఒకరి నుంచి మరొకరికి అందించాల్సిందే కానీ కృత్రిమంగా తయారుచేయలేం. అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానం. ఒకరి రక్తం మరొకరి ఆయుష్షు కాపాడుతుంది. రక్తానికి పేద, ధనిక భేదాలు లేవు. ఒకమనిషి రక్తం మరో మనిషికి అందిస్తేనే వారి ప్రాణాలు నిలుస్తాయన్న సంగతి తెలిసినా చాలా మంది రక్తదానం చేయడానికి భయపడుతున్నారు. కొంతమంది మాత్రం ఎప్పుడు రక్తం అవసరం వచ్చినా మేమున్నామంటూ ముందుకొస్తున్నారు. వారు కూడా రక్తదానం చేయపోతే అత్యవసరమైన వారి పరిస్థితి ఇబ్బందికరమే.

రక్తదానానికి వీరు అర్హులు..

అపోహలు వీడి రక్తదానం చేయాలనుకునేవారు ఆరోగ్యంగా ఉండడంతోపాటు 18 నుంచి 60 ఏళ్ల లోపు వయసు, 50 కిలోల బరువు కలిగిఉండాలి. హిమోగ్లోబిన్ శాతం 12.5 ఉండాలి. చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా, ఇతర వ్యాధులు సోకిన వారు నయమైన నాలుగు నుంచి ఆరు నెలల తరువాత రక్తదానం చేయవచ్చు. రక్తదానం చేసేవారి నుంచి కేవలం 300 మిల్లీ లీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు.

- రక్తాన్ని సేకరించే ముందు వైద్యులు దాత ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు.



స్వచ్ఛందంగా 55వ సారి రక్తదానం చేస్తున్న యువకుడు

వీరు అనర్హులు..

- ✔ మధుమేహ వ్యాధి గ్రస్తులు, రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు రక్తం ఇవ్వకుండా ఉండాలి. అలాగే గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్నవారు
- ✔ క్యాన్సర్ శస్త్రచికిత్స చేయించుకున్నవారు, గుండెపోటుకు గురైనవారు
- ✔ మూర్ఛవ్యాధి ఉన్నవారు, కంటి జబ్బులు, కంటి కలక వంటివి ఉన్నప్పుడు రక్తదానం చేయవద్దు.

రక్తదానానికి ముందుంటాను..



రక్తదానానికి ఎప్పుడూ ముందుంటాను. ఇప్పటివరకు శిబిరాల ద్వారా, స్వచ్ఛందంగా 55 సార్లు రక్తదానం చేశాను. ఆపదలో ఉన్నవారికి ఇలా ఉపయోగపడడం చాలా సంతోషంగా ఉంది. రక్తదానం చేయడం ద్వారా ఎంతో ఆరోగ్యంగా ఉన్నాను. ఎప్పుడు అవసరమైనా రక్తం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను. మరికొంతమంది యువకులకు అపోహలు తొలగించి రక్తదానం చేసేలా కృషిచేస్తున్నాను.

శనపతి రాము, రక్తదాత, పాగిరి

స్వచ్ఛందంగా..



రక్తదానం ఆవశ్యకత తెలుసుకున్న నేను ఇప్పటి వరకు 42 సార్లు రక్తదానం చేశాను. ఎవరికైనా అత్యవసరం అనుకుంటే రక్తం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను. కరోనా సమయంలో కూడా ప్లాస్మా దానం చేయడం ఎంతో ఆనందాన్నిచ్చింది. నాలాగే మరికొంత మంది యువత రక్తదానానికి ముందుకు రావాలి.

మండల చైతన్యకుమార్, రక్తదాత, రాజాం

యువత సహకారం అవసరం..



రక్త నిల్వలు పూర్తిగా తగ్గుముఖం పట్టకుండా ఉండాలంటే యువత సహకారం ఎంతైనా అవసరం. యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేయాలి. కొన్ని చోట్ల యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయం.

పెంకి చైతన్యకుమార్, రెడ్‌క్రాస్ సభ్యుడు, రాజాం

అపోహలు వీడాలి..



రక్తదానం చేయడం వల్ల ఏదో అయిపోతుందనే అపోహలు వీడాలి. ఆరోగ్యవంతంగా ఉండి 18 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వారు ఎవరైనా రక్తదానం చేయవచ్చు. ఇప్పటి వరకు పదిసార్లు రక్తదానం చేశా. ఎటువంటి సమస్యలు తలెత్తలేదు. ప్రస్తుత తరుణంలో యువత ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, రాజాం